సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



ప్రతి తప్పుకు ఒక లెక్క ఉంది

నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా కట్టేశా నని అనుకుంటే సరిపోదు. చేసిన తప్పు లకు పాయింట్లు కేటాయిస్తారు. - 8లో



కాపర్ వైరు చోరీ ముఠా అరెస్ట్

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేస్తున్న నలుగురిని మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



చంద్రబాబు మెప్పు కోసమే..

చంద్రబాబు మెప్పు కోసమే రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తామని అంటున్నారని గొంగిడి సునీత అన్నారు. - 9లో

బియ్యం పురుగుల పాలు!

- ఐదు నెలలుగా రేషన్‌దుకాణాల్లో నిల్వ ఉంటున్న దొడ్డు బియ్యం
- తుట్టెలు కట్టి పనికిరాకుండా పోతున్న బియ్యం
- వేలం వేసేందుకు చర్యలు చేపట్టని అధికారులు
- సన్నబియ్యానికి కూడా చేరుతున్న పురుగులు



తుర్కపల్లిలోని ఓ రేషన్ షాపులో తుట్టెలు కట్టిన బియ్యం



రేషన్ షాపులో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

సాక్షి, యాదాద్రి : రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ముక్కిపోతున్నాయి. ఈ ఏడాది మార్చి వరకు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయగా.. ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. అంతకుముందు రేషన్ దుకాణాలకు సరఫరా చేసిన దొడ్డుబియ్యం ఐదు నెలలుగా వృథాగా ఉంటున్నాయి. దీంతో చాలా చోట్ల ఈ బియ్యం పురుగులు పట్టి, తుట్టెలు కడుతున్నాయి. వీటికి తోడు వివిధ కారణాలతో సన్న బియ్యం తీసుకోని వారివి కూడా రేషన్ దుకాణాల్లో నిల్వ ఉండడంతో వాటికి కూడా పురుగులు పట్టే పరిస్థితి ఏర్పడింది.

కొందరు బియ్యం తీసుకోకపోవడంతో..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 515 రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం, సన్న బియ్యం నిల్వలు ఉన్నాయి. సన్న బియ్యం 1700 మెట్రిక్ టన్నులు, దొడ్డుబియ్యం 700 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. మూడు నెలల అనంతరం బియ్యం తీసుకోవడానికి రేషన్ దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులకు తుట్టెలు కట్టిన, లక్కపురుగులు పట్టిన బియ్యం కనిపించాయి.

రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డుబియ్యం : **700** మెట్రిక్ టన్నులు	బఫర్ గోదాముల్లో ఉన్న దొడ్డుబియ్యం : 347 మెట్రిక్ టన్నులు
ఎంఎల్ఎస్ పాయింట్లలో ఉన్న దొడ్డు బియ్యం : **181** మెట్రిక్ టన్నులు	
రేషన్ దుకాణాల్లో నిల్వఉన్న సన్న బియ్యం : **1700** మెట్రిక్ టన్నులు	

అయితే జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల బియ్యం జూన్‌లోనే ప్రభుత్వం రేషన్ దుకాణాలకు సరఫరా చేసింది. అయితే కొందరు లబ్ధిదారులు గ్రామాల నుంచి వలసపోయారు. మరికొందరు వివిధ కారణాలతో బియ్యం తీసుకోలేదు. ప్రధానంగా తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజాపేట, నారాయణపురం, చౌటుప్పల్, బీబీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌కు వలసపోయారు. వారు నివాసం ఉంటున్న చోటనే ఈ పాస్ ద్వారా అక్కడేరేషన్ తీసుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో వారి పేరున వచ్చిన రేషన్ డీలర్ వద్దే మిగిలిపోయింది. దీంతో పాత బియ్యం, కొత్త బియ్యం పురుగుల పాలవుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొడ్డుబియ్యం వేలానికి చర్యలు

జిల్లాలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం వేలం వేయడానికి కమిషనరేట్ స్థాయిలో చర్యలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రేషన్‌దుకాణాలు, గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద 1600 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం, 1700 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం క్లోజింగ్ బ్యాలెన్స్ ఉన్నాయి. కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు దొడ్డు బియ్యం వేలానికి చర్యలు తీసుకుంటాం.

– హరికృష్ణ, సివిల్ సప్లై డీఎం

దొడ్డు బియ్యం ఖాళీ చేయకుండానే..

జిల్లాలోని రేషన్‌దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గోదాముల్లో 1600 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం దొడ్డు బియ్యం ఆయా చోట్లనుంచి ఖాళీ చేయకుండానే సన్న బియ్యం స్టాక్ పెట్టింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు వస్తున్న సన్నబియ్యంతో అప్పటికే నిల్వ ఉన్న దొడ్డుబియ్యం నుంచి పురుగులు సన్న బియ్యానికి పడుతున్నాయి.

న్యూస్‌రీల్

హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఆత్మకూర్(ఎం)కు అటాచ్

సాక్షి ఎఫెక్ట్..

చౌటుప్పల్ : వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని డీజే సౌండ్ సిస్టమ్‌ను కారణంగా చూపించి ఉత్సవాల నిర్వాహకుల వద్ద పోలీస్ సిబ్బంది డబ్బులు వసూలు చేయడంతో గణేషా... గస్తీ గాడి తప్పింది శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించింది. ఈ కథనానికి ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి స్పందించారు. అందుకు సంబంధించి విచారణ జరిపించారు. వాస్తవం అని తేలడంతో ఆరోజు సాయంత్రం విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రాంబాబుతోపాటు కానిస్టేబుల్ వెంకన్నను ఆత్మకూర్(ఎం) పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాక్షి కథనం పట్ల వినాయక ఉత్సవాల నిర్వాహకులు, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ



విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి: పోషక విలువతో కూడిన రాగిజావను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని బీచ్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో రాగిజావను ఆయన అందజేశారు. గత సంవత్సరం మాదిరిగానే విద్యార్థులకు రాగిజావ అందించనున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి : ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక విద్యా బోధకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 22మంది ప్రత్యేక విద్యా బోధకులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక విద్యా బోధకులు పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాల విద్యార్థులతో పాటు సంబంధిత కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన చేయనున్నట్లు తెలిపారు.

మానసిక సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ఎంఏ కరీం

భూదాన్‌పోచంపల్లి : పిల్లల్లో మానసిక సామర్థ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మైండ్‌పవర్ స్పెషలిస్ట్, ప్రముఖ సైకలాజిస్ట్ డాక్టర్ ఎం.ఏ కరీం అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జీవీ ఫంక్షన్‌హాల్‌లో మనో వైజ్ఞానిక, మానసిక వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన వైకల్యాల నిరోధానికి వారి మనస్సును మెప్పించే వినోదంతో కూడిన చదువును అందించాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మెజీషియన్ రామకృష్ణ నిర్వహించిన మ్యాజిక్ పిల్లలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం మెమొరీ కాంటెస్ట్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లి దళార్చన

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో స్వామివారిని సిందూరంతోపాటు, పాలతో అభిషేకించారు. అనంతరం నాగవల్లి దళార్చన చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఇక శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు కొనసాగాయి.

వైఎస్సార్‌కు నివాళి



భువనగిరిటౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రోగులకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ హనుమంతరావు



పల్లె దవాఖానాలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి మండలంలోని అనాజీపురం గ్రామంలో పల్లె దవాఖానాను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంతకుముందు ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంఎల్‌హెచ్‌పీ విజయ, కస్తూరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి



పెద్దచెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ నెల 5న గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భువనగిరి పట్టణ శివారులోని పెద్ద చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చెరువు వద్ద భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు వద్ద తాగు నీరు, వైద్యం, మూత్రశాలలు, శానిటేషన్, లైటింగ్స్, క్రేన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గణేష్ నిమజ్జనం అనంతరం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పట్టణ సీఐ రమేష్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, టీజీఎంఎస్ సంక్షేమ హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు, హెచ్‌డబ్ల్యూఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. నాణ్యత కలిగిన వంట సరుకులు, కూరగాయలు వాడాలన్నారు. సమావేశంలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి జినుకల శ్యాంసుందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పరంకుశ సాహితీ పాల్గొన్నారు.

డిసెంబర్‌లోపు పూర్తిచేయాలి

ఉపాధి హామీ నిధులతో పంచాయతీ రాజ్ విభాగం ద్వారా చేపడుతున్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల ప్రహరీ నిర్మాణ పనుల ప్రగతి, వాటర్‌షెడ్ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ పనుల ప్రగతిపై మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సమీక్ష నిర్వహించారు. పనులు డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలకు వాచ్ వార్డు పర్సన్లను నియమించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలచందర్, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ సురేష్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌తోనే నిజాం పాలనకు విముక్తి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు

చౌటుప్పల్ : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అండతోనే నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లి పర్యటనకు వెళ్తున్న ఆయన మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళా నేతలు తిలకం దిద్ది స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నైజాం దుర్మార్గపు పాలనకు అనేక సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఆనాటి నైజాం బాధితుల త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మాజీ సర్పంచ్ రమనగోని దీపిక, పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన, నాయకులు దోనూరి వీరారెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, బత్తుల జంగయ్య, ఊడుగు యాదయ్య, వెంకటేశం, కడారి అయిలయ్య, వనం ధనుంజయ్య, ఊదరి రంగయ్య, ఇటిక్యాల దామోదర్‌రెడ్డి, బాతరాజు ప్రవీన్, గుండెబోయిన వేణు, బుడ్డ సురేష్, తోకల సాయి, నల్ల శివప్రసాద్, అమృతం దశరథ, పర్నె గాయత్రి, ఊదరి శారద, బత్తిని విజయలక్ష్మి, శేఖర్‌రెడ్డి, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం రూ.10కోట్లు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో రూ.10కోట్ల మేర నష్టం వాటిల్లిందని అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. 18 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. చనిపోయిన నలుగురికి పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. 27 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా.. ఒక్కో ఇంటికి రూ.3.200 చొప్పున పరిహారం ఇస్తామని పేర్కొన్నారు. 16 చెరువులకు నష్టం వాటిల్లిందని, 8 చెరువులకు గండ్లు పడ్డాయని తెలిపారు. వాటికి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.75 లక్షలు అవసరం కాగా శాశ్వత మరమ్మతుల కోసం రూ.5.71 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ రోడ్లు 21 ప్రాంతాల్లో దెబ్బతిన్నాయని 4.95 కిలో మీటర్ల మేర గుంతలు పడ్డాయని, పంచాయతీ రాజ్ రోడ్లు 3.1 కిలోమీటరు మేర దెబ్బతిందని, నాలుగు కల్వర్టులు దెబ్బతినగా ఇందులో రెండుకల్వర్టులు పూర్తిగా కొట్టుకుపోయాయని తెలిపారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.38 లక్షలు, శాశ్వత మరమ్మతుల కోసం రూ.63 లక్షలు అవసరం అవుతాయని పేర్కొన్నారు.

సాగర్‌కు తగ్గిన వరద.. క్రస్ట్ గేట్లు మూసివేత

నాగార్జునసాగర్ : ఎగువ నుచి వరద తగ్గుముఖం పట్టడంతో సాగర్ క్రస్ట్ గేట్లను మంగళవారం రాత్రి మూసివేశారు. ఎగువన గల శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పాదనతో కేవలం 51,635 క్యూసెక్కులు మాత్రమే సాగర్‌లోకి వస్తోంది. దీంతో అంతే నీటిని నాగార్జునసాగర్ నుంచి విద్యుత్ ఉత్పాదన, ఆయకట్టు అవసరాలకు విడుదల చేస్తున్నారు.

నష్టపరిహారం ఇవ్వకుంటే ఉద్యమిస్తాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

భువనగిరిటౌన్ : వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగానికి, ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరాజు, కల్లూరి మల్లేశం, పాండు, పెంటయ్య, కృష్ణారెడ్డి, స్వామి, మాయ కృష్ణ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, రాగిరు కిష్టయ్య, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరిటౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ లావుడియ రాజు అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జగన్ మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్కాలర్‌షిప్స్ రాక విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. భువనగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయిందన్నారు. మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గురుకులాల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుక్కుట్ల శివాని, జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, జగన్ నాయక్, గాయత్రి, సహాయ కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ పుట్టల ఉదయ్, హిందూ రాణి, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ నేహాల్, నరేందర్, పూజిత, శ్రావణ్, మహేష్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పల్లె ఓటర్లు 5.32లక్షలు

- గ్రామ పంచాయతీ తుది ఓటరు జాబితా విడుదల
- పెరిగిన 1,18,089 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలు 3,704



భువనగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓటరు జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

మండలాలు :	17
గ్రామ పంచాయతీలు :	427
మొత్తం ఓటర్లు :	5,32,240
పురుషులు :	2,64,577
మహిళలు:	2,67,661
ఇతరులు :	02
పోలింగ్ కేంద్రాలు :	3,704

సాక్షి, యాదాద్రి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారులు ప్రకటించారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఈ జాబితాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఈ జాబితా ప్రకారం.. జిల్లాలోని 17 మండలాల్లో గల 427 గ్రామ పంచాయతీల్లో 5,32,240 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,64,577 మంది ఉండగా.. మహిళలు 2,67,661 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 3,084 మంది అధికంగా ఉన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 3,704 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా.. గత 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల కంటే ఈ సారి 1,18,089 మంది ఓటర్లు పెరిగారు.

గుండాల మండలంతో కలిపి..

గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గుండాల మండలం జనగామ జిల్లాలో ఉంది. అప్పుడు జిల్లాలోని 16 మండలాల్లో 401 గ్రామ పంచాయతీలకే ఎన్నికలు జరిగాయి. 3,92,157 మంది ఓటర్లు ఉన్నారు. తర్వాత ప్రభుత్వం గుండాల మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలో కలిపింది. 20 గ్రామ పంచాయతీలు కలవడంతో గ్రామ పంచాయతీల సంఖ్య 421కి చేరింది. దీంతో ఓటర్ల సంఖ్య 3,92,157నుంచి 4,14,151కి పెరిగింది.

ముసాయిదా కంటే స్వల్పంగా పెరిగిన ఓటర్లు

ముసాయిదా ఓటరు జాబితా కంటే 22 ఓట్లు పెరిగాయి. ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య 5,32,218 కాగా ఇందులో పురుషులు 2,64,567, స్త్రీలు 2,67,649, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం మొత్తం ఓటర్లు 5,32,240కు చేరింది.

మండలాల వారీగా మొత్తం గ్రామ పంచాయతీ ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
అడ్డగూడూరు	11,320	11,702	23,022	150
ఆలేరు	10,501	11,036	21,537	140
ఆత్మకూర్	12,890	12,643	25,533	192
భువనగిరి	19,592	20,062	39,654	294
బీబీనగర్	21,299	21,577	42,876	284
బొమ్మలరామారం	14,631	14,872	29,503	284
పోచంపల్లి	13,733	13,764	27,497	192
చౌటుప్పల్	19,096	19,405	38,501	236
గుండాల	13,152	12,917	26,069	182
మోటకొండూరు	10,495	10,608	21,103	170
మోత్కూర్	6,528	6,687	13,215	88
నారాయణపురం	20,151	19,692	40,113	260
రాజాపేట	14,972	15,264	30,236	206
రామన్నపేట	22,684	22,674	45,358	232
తుర్కపల్లి	13,846	14,131	27,977	266
వలిగొండ	26,030	26,401	52,431	330
యాదగిరిగుట్ట	13,657	13,958	27,615	198
మొత్తం	2,64,577	2,67,661	5,32,240	3704

క్లుప్తంగా

ప్రో కబడ్డీ లీగ్ అంపైర్‌గా కొంపెల్లి వీరస్వామి


కొంపెల్లి వీరస్వామి

సూర్యాపేటటౌన్, గరిడేపల్లి: వివిధ దేశాల క్రీడాకారులు పాల్గొంటున్న ప్రో కబడ్డీ లీగ్‌లో టెక్నికల్ అఫీషియల్(అంపైర్)గా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన కొంపెల్లి వీరస్వామి ఎన్నికైనట్లు సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామా నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరస్వామి ఎంపికకు సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి ప్రో కబడ్డీ లీగ్ అంపైర్‌గా వీరస్వామి ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

ఇంపాక్ట్ ఉత్తమ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీలత


శ్రీలతను సన్మానిస్తున్న ఇంపాక్ట్ మహిళలు

నేరేడుచర్ల: ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్(ఐసీఐ) ఉత్తమ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నేరేడుచర్లకు చెందిన వీరవెల్లి శ్రీలత ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని లక్డీకపూల్‌లో గల ఐసీఐ కార్యాలయంలో ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీలతను పలువురు మహిళలు ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షురాలు మాధవి, నారీ సెల్ అడ్వైజర్ నళిని, జాతీయ ఉపాధ్యక్షురాలు రాజేశ్వరీ, యంగ్ అండ్ డైనమిక్ నారీ సెల్ డైరెక్టర్ దేవరపల్లి తబిత, సంధ్యారాంకరణం, సునీత, జగదీశ్వరీ, నవనీత, విజయలక్ష్మి, కీర్తి శ్రీవాణి తదితరులున్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందుకుంటున్న ఇషాన్

నకిరేకల్: నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన బచ్చుపల్లి ఇషాన్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. బచ్చుపల్లి నవీన్, పావని దంపతుల కుమారుడైన ఇషాన్ ఖమ్మం జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇషాన్ తల్లి ఖమ్మంలోనే బ్యాంకులో జాబ్ చేస్తుండగా.. తండ్రి నల్లగొండలో ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ నల్లగొండలోనే నివాసముంటున్నారు. ఇషాన్ కళ్లకు గంతలు కట్టుకుని వరుసగా 16 దేశభక్తి గీతాలను పియానోపై వాయించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఇషాన్ రికార్డు సాధించడం పట్ల మంగళపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): యూరియా కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలం మాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డె కృష్ణ (25) యూరియా కోసం సోమవారం ఉదయం తిరుమలగిరికి వచ్చాడు. తిరిగి రాత్రి సమయంలో మాసిరెడ్డిపల్లికి వెళ్లేందుకు గాను తిరుమలగిరి మండలం కేంద్రంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రతి తప్పుకు ఒక లెక్క ఉంది!

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే పెనాల్టీ పాయింట్‌ల విధింపు
- ఏడాదికి 12 పాయింట్లు దాటితే లైసెన్స్ రద్దు


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి): సాధారణంగా చదువు, ఆటల్లో ఎన్ని ఎక్కువ మార్కులు లేదా పాయింట్లు సాధిస్తే అంత గుర్తింపు ఉంటుంది. కానీ ట్రాఫిక్ పోలీసులు అమలు చేస్తున్న ప్రతి పెనాల్టీ పాయింట్‌కు ఒక లెక్క ఉంది. ఎంత తక్కువ పాయింట్లు ఉంటే అంత జరిమానా నుంచి మినహాయింపు ఉంటుంది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. వాహనదారులు చేసే తప్పుల నుంచి మేల్కొనేలా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

చలానా చెల్లించినా లెక్క తగ్గదు..

నిబంధనలు అతిక్రమించి జరిమానా కట్టేశాను అని అనుకుంటే సరిపోదు. చేసిన తప్పులకు ఆన్‌లైన్‌లో పెనాల్టీ పాయింట్లు కేటాయిస్తారు. ఇది 12 పాయింట్లు దాటితే ఏడాది పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుంది. మరోసారి 12 పాయింట్లు దాటితే రెండు సంవత్సరాల పాటు లైసెన్స్ రద్దు చేస్తారు. మూడోసారి కూడా 12 పాయింట్లు దాటితే శాశ్వతంగా లైసెన్స్ కోల్పోతారు. లెర్నింగ్ లైసెన్స్ ఉన్న సమయంలో 5 పాయింట్ల పరిమితి దాటితే లైసెన్స్ పొందే అవకాశం ఉండదు.

ట్రాఫిక్ ఉల్లంఘనకు పాయింట్లు ఇలా..

- కారులో సీటు బెల్ట్, ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ లేకుంటే – 1 పాయింట్
- సిగ్నల్ జంప్, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే – 2
- మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపితే – 3
- మద్యం తాగి కారు, లారీ, గూడ్స్ వాహనం నడిపితే – 4
- వాహనాలతో రేసింగ్‌కు పాల్పడితే – 3
- వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోతే – 2

ఇలా తెలుసుకోవచ్చు

గూగుల్‌లో పబ్లిక్ వ్యూ అని టైప్ చేస్తే తెలంగాణ స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్, ఈ–చలాన్ అని వస్తుంది. దానిపై క్లిక్ చేసి అందులో వాహన రిజిస్ట్రేషన్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు నమోదు చేస్తే పాయింట్ల వివరాలను తెలుసుకోవచ్చు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు

చిట్యాల: పాఠశాల అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళ్లిన అధికారులతో దురుసుగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కల్గించిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల పోలీసులు మంగళవారం తెలిపారు. చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా గోగికార్ మాధవి గతంలో పనిచేసి ప్రస్తుతం అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తోంది. ఆమె ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా ఉన్న సమయంలో ఆ పాఠశాలకు పీఎంశ్రీ పథకం ద్వారా మంజూరైన సుమారు రూ.6.50లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించిన పలువురు జిల్లా విద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ భిక్షపతి ఆదేశాల మేరకు విచారణ చేసేందుకు సోమవారం జిల్లా అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ ఆఫీసర్ సీహెచ్. యోగేంద్రనాథ్, చిట్యాల ఎంఈఓ పి. సైదానాయక్ పాఠశాలకు వెళ్లారు. విచారణలో భాగంగా రికార్డులను స్వాధీనం చేసుకునే క్రమంలో ఆమె వారికి సహకరించకపోగా దురుసుగా ప్రవర్తిస్తూ వాగ్వాదానికి దిగింది. అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిన రికార్డులను లాక్కొని అధికారుల విధులకు ఆటంకం కల్గించింది. దీంతో విచారణకు వచ్చిన అధికారులు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మాధవిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

కాపర్ వైరు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- మరొకరు పరారీ
- రూ.2.50లక్షల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

కోదాడరూరల్: జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను మంగళవారం సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన పాలపర్తి వెంకట్రామయ్య పాత ఇనుము వ్యాపారం చేసేవాడు. అతడికి ఒంగోలు పట్టణానికే చెందిన బలిగా శ్రీకాంత్, గుంటకళ్ల ఖాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాక్ పరిచయమయ్యారు. వీరంతా చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరు ఈ ఏడాది మార్చి, మే నెలల్లో కారు అద్దెకు తీసుకొని సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్పీ) కాల్వపై లిఫ్ట్ మోటార్లకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీ చేశారు. చోరీ చేసిన కాపర్ వైరును ఒంగోలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లోని పలు ఫ్యాక్టరీలకు కేజీ రూ.400 చొప్పున విక్రయించారు. అదే మాదిరిగా మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు దొంగతనం చేసేందుకు వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో పాలపర్తి వెంకట్రామయ్య, గుంటకళ్ల ఖాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాక్‌ను మంగళవారం మునగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో వ్యక్తి బలిగా శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.2.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సీసీఎస్ సీఐ శివకుమార్, ఎస్ఐలు హరికృష్ణ, యాదవేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది రామారావు, కొండలు, మల్లేష్, శివ, ఆనంద్, శ్రీనును సూర్యాపేట ఎస్పీ నరసింహ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎన్‌సీసీ జాతీయ శిబిరానికి ఆలేరు క్యాడెట్లు ఎంపిక


జాతీయ శిబిరానికి బయల్దేరి వెళ్తున్న ఆలేరు ఎన్‌సీసీ యూనిట్ అధికారి, క్యాడెట్‌లు

ఆలేరు: నేషనల్ క్యాడెట్ కారప్స్(ఎన్‌సీసీ) జాతీయ శిబిరానికి ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ యూనిట్‌కు చెందిన పది మంది క్యాడెట్‌లు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాలోని పోలీసు శిక్షణ కేంద్రం(పీటీసీ)లో 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' పేరుతో మంగళవారం ప్రారంభమైన ఎన్‌సీసీ జాతీయ శిబిరం ఈ నెల 13వ తేదీ వరకు జరుగనుంది. ఆలేరు ఎన్‌సీసీ యూనిట్ నుంచి 9, 10వ తరగతులకు చెందిన ఐదుగురు విద్యార్థినులు, ఐదుగురులు విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ యూనిట్ అధికారి దూడల వెంకటేష్ ఈ శిబిరంలో పాల్గొననున్నారు. ఈ క్యాంపులో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెదిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారు. 12రోజుల పాటు జరుగనున్న జాతీయ శిబిరంలో ఆయా రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, వంటలు తదితర అంశాలను ఎన్‌సీసీ క్యాడెట్‌లు పరస్పరం పంచుకుంటారని ఎన్‌సీసీ యూనిట్ అధికారి దూడల వెంకటేష్ చెప్పారు. అంతేకాకుండా చారిత్రక కట్టడాలు, వివిధ అంశాలపై క్షేత్రస్థాయి పర్యటనలతో ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఎన్‌సీసీ క్యాడెట్లలో జాతీయ సమైకత్యను పెంపొందించడమే ఈ జాతీయ శిబిరం ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

రాజగోపాల్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం సరికాదు

- డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మునుగోడు: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై మొదటగా మాట్లాడింది మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డే అని, అలాంటి వ్యక్తి ఇప్పుడు కాళేశ్వరంలో అవినీతి జరగలేదని మాట్లాడినట్లు తప్పుడు వార్తను సృష్టించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల కోసం కాకుండా కమీషన్ల కోసమే బీఆర్ఎస్ నాయకులు నిర్మించారని అసెంబ్లీ సాక్షిగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారని అన్నారు. సోషల్ మీడియాలో రాజగోపాల్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. తప్పుడు వార్తలను ఖండిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారమంతా బీఆర్ఎస్ పనే అని విమర్శించారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటుంటే వారికి బుద్ధి చెప్పడానికి తన పదవిని వదిలేసిన చరిత్ర రాజగోపాల్‌రెడ్డిదన్నారు. కాగా రాజగోపాల్‌రెడ్డిపై తప్పుడు వార్తలు సృష్టించి ప్రముఖ పత్రికల పేర్లతో విడుదల చేస్తున్నారని.. వాటిని నమ్మొద్దని రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు 2,679 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను పైకెత్తి 2530 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నారు. ఇందులో కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 353 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 643.75 అడుగుల మేర నీటి మట్టం ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.13 టీఎంసీల నీరు ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ


వివరాలు సేకరిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది

హుజూర్‌నగర్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ఏవీఎస్ అపార్ట్‌మెంట్ సమీపంలో నివాసముంటున్న గాయం వీరభద్రారెడ్డి గత నెల 19న తన బంధువు చనిపోవడంతో ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. వారి ఇంట్లో పనిచేసే పనిమనిషి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఆ ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆమె ఈ విషయాన్ని వీరభద్రారెడ్డికి తెలియజేసింది. వెంటనే ఆయన హైదరాబాద్ నుంచి వచ్చి చూడగా వంటగది తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి లాకర్‌లో దాచిన వజ్రాలు పొదిగిన బంగారపు నెక్లెస్, వడ్డాణం, జూకాలు, చెవి బుట్టలు, దిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వాటి విలువ సుమారు రూ.25 లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్ఐ మోహన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత


పర్సు అప్పగిస్తున్న చిట్యాల ఆర్టీసీ అధికారులు

చిట్యాల: బస్టాప్‌లో మహిళా ప్రయాణికురాలు పోగొట్టుకున్న పర్సును తిరిగి ఆమె కుమారుడికి ఆర్టీసీ అధికారులు అప్పగించారు. వివరాలు.. మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన వడ్డెపల్లి అంబబాయి తన కుమారుడితో కలిసి మంగళవారం చిట్యాలలో బస్టాండ్ ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల బస్టాప్‌లో సూర్యాపేట డిపోకు చెందిన బస్సు ఎక్కి హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె తన పర్సును పోగొట్టుకుంది. ఆ పర్సును చిట్యాలకు చెందిన శ్రీకనకదుర్గ అలయ డైరెక్టర్ రుద్రారపు లింగస్వామికి దొరకడంతో ఆయన వెంటనే బస్టాప్ వద్ద డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగి జంగయ్యకు అందజేశాడు. జంగయ్య సూర్యాపేట డిపోకు ఫోన్ చేసి బస్సులో ప్రయాణించిన మహిళ పర్సు పోగొట్టుకున్నట్లు సమాచారం ఇచ్చాడు. డిపో అధికారులు బస్సు డ్రైవర్ ద్వారా అందులో ప్రయాణిస్తున్న మహిళకు సమాచారం ఇవ్వగా.. ఆమె కుమారుడికి చిట్యాల ఆర్టీసీ కంట్రోలర్ పీబీ. చారి సమక్షంలో పర్సు తిరిగి అప్పగించారు.

కొత్తగూడెం మాజీ సర్పంచ్ మృతి

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కొత్తగూడెం మాజీ సర్పంచ్ నకిరేకంటి ప్రసాద్ నాలుగు నెలల క్రితం మిర్యాలగూడ సమీపంలోని కొండ్రపోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆయన భౌతికకాయానికి హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, వివిధ పార్టీల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

సూర్యాపేటటౌన్: పాఠశాలలో ఉపాధ్యాయుల విధులకు ఆటంకం కలిగిస్తూ అమర్యాదగా ప్రవరిస్తున్న యువకుడిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో సదరు పాఠశాల హెచ్‌ఎం పద్మ మంగళవారం ఫిర్యాదు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో నిత్యం విద్యార్థులతో ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో అహ్మద్ పాషా అనే యువకుడు అనుమతి లేకుండా పాఠశాల ఆవరణలోకి వచ్చి వీడియోలు, ఫొటోలు తీస్తుంటాడని, స్కూల్ సమయం ముగిశాక విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నాడని హెచ్‌ఎం ఫిర్యాదులో పేర్కొంది. టీచర్లకు, హెచ్‌ఎంకు ఫోన్ చేసి అమర్యాదగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఆ యువకుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- 8 మందికి తీవ్రగాయాలు

కట్టంగూర్: కట్టంగూర్ మండలం మునుకుంట్ల, కల్మెర గ్రామాల్లో మంగళవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పిచ్చికుక్క దాడిలో కల్మెర గ్రామానికి చెందిన ఐదుగురు, మునుకుంట్ల గ్రామానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మునుకుంట్ల గ్రామానికి చెందిన శ్రీశైలంతో పాటు మరో ఇద్దరిని మొదట కుక్క కరిచి గాయపర్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కుక్కను వెంబడించి కర్రలతో గ్రామం నుంచి తరిమేశారు. దీంతో మధ్యాహ్నం వరకు కల్మెర గ్రామానికి చేరుకున్న అదే కుక్క రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న యాదయ్య, నాగరాజు, శోభ, లక్ష్మితో పాటు మరొకరిపై దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారిని గ్రామస్తులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుక్క దాడితో ఆయా గ్రామాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గతంలోనూ పలుమార్లు కుక్కలు పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు.

రూ.3.81 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్ట్
- నిందితుల్లో సూర్యాపేట జిల్లా వాసి

వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుకలగుట్ట దగ్గర భారీ ఎత్తున గంజాయిని పట్టుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మంగళవారం వరంగల్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి కర్ణాటకకు సరఫరా చేయడానికి గంజాయి సిద్ధంగా ఉందనే సమాచారం మేరకు ఖానాపురం, వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీం సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.3,81,92,250 విలువైన 763 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిని అరెస్ట్ చేయగా.. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సీపీ చెప్పారు.

నిందితులు వీరే..

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మారేడిమిల్లి మండలం గుంపినగండి గ్రామానికి చెందిన అందాల పాండురెడ్డి, ఒడిశాలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గుల్లూరి మునిరాజ్, దులగండి గ్రామానికి చెందిన కొప్పు కోటయ్య, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పోలారంతండాకు చెందిన భూక్య సాయికుమార్, కలిమేల మండలం గుర్రలూరు గ్రామానికి చెందిన రమేశ్, గిల్లమడుగు గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ, నిమ్మలపాలెం గ్రామానికి చెందిన నాయిని రమేశ్, బీదర్‌కు చెందిన ప్రకాశ్.

గంజాయి దాచి.. ఆపై పట్టుబడి

నిందితులు పాండురెడ్డి, గుల్లూరి మునిరాజ్, కొప్పు కోటయ్య, భూక్య సాయికుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో మరో ఇద్దరు నిందితులు రమేశ్, మజ్జి కృష్ణ గంజాయి అమ్ముతున్నారని తెలుసుకుని వారితో పరిచయం పెంచుకున్నారు. అనంతరం రమేశ్, మజ్జి కృష్ణ ఆదేశాల మేరకు గంజాయిని వాహనాల్లో వారు చెప్పిన చోటుకు చేర్చేవారు. దీనికి రూ.వెయ్యి చొప్పున కూలి కట్టించేవారు. గత నెల 28న నిందితులు పాండు, మునిరాజ్, కోటయ్య, రమేశ్ కలిసి తులసిపాక నుంచి నంబర్‌లేని ఆటోలో గంజాయి తీసుకుని భద్రాచలం, ఇల్లందు మీదుగా వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో పాకాల దాటిన తర్వాత పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు గమనించిన నిందితులు ఈ విషయాన్ని కృష్ణకు చేరవేశారు. దీంతో అతడి ఆదేశాల మేరకు చిలుకలగుట్టపై గంజాయి బస్తాలు దాచి వెళ్లిపోయారు. ఈ నెల 1న సాయికుమార్.. గంజాయి కొనుగోలు చేసే వ్యక్తిని తీసుకొస్తున్నాడని రమేశ్ ఫోన్ ద్వారా మునిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణకు చెప్పాడు. గంజాయి బస్తాలను గుట్ట పైనుంచి కిందికి దించుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని 23 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్, మునిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణను అరెస్ట్ చేయగా.. పాండురెడ్డి, ఎన్. రమేశ్, ప్రకాశ్, రమేశ్ పరారయ్యారని సీపీ తెలిపారు.

జింక్ లోపం నివారిస్తేనే అధిక దిగుబడులు

- గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సూచనలు


జింక్ లోపంతో ఎర్రబారిన వరి చేను



గుర్రంపోడు: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోతుండటం దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రసాయన ఎరువుల్లో ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండటం.. సూక్ష్మపోషకాలు లేకపోవడం వలన దీర్ఘకాలికంగా రసాయన ఎరువుల మీద ఆధారపడి సాగుచేసే నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఏర్పడతాయి. తక్కువ పరిమాణంలో అవసరమయ్యే జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర పోషకాలు పైరు ఎదుగుదలకు, మంచి దిగుబడులకు దోహదపడతాయి. వరి మాగాణుల్లో ఏర్పడే ముఖ్యమైన జింక్ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తెలియజేశారు.

వరిలో జింక్ లోపానికి కారణాలు

వరిలో జింకు లోపం అధికంగా రావడానికి ముఖ్య కారణం సేంద్రియ ఎరువుల వినియోగం తక్కువగా ఉండటం. వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ లాంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి నేలలో కలియదున్నుతున్నారు. ఇది మినహా సేంద్రియ ఎరువుల వినియోగం వరిలో అత్యధిక విస్తీర్ణంలో లేనట్లే. వరిలో జింక్ లోపం ఏర్పడటానికి మరో ముఖ్య కారణం వరిసాగు చేసే నేలల్లో చౌడు ఉండటం. చౌడు వల్ల నేలల్లో ఉన్న జింకు మొక్కలకు సులభంగా అందుబాటులోకి రాక పైరులో జింకు లోపం ఏర్పడుతుంది. ఈ కారణాలే కాక రసాయనిక ఎరువులు సమతుల్యంగా వాడనప్పుడు, మురుగు నీరు సరిగా బయటకు వెళ్లని నేలల్లో సాగు చేసినప్పుడు వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గినప్పుడు కూడా వరిలో జింకు లోపం కనిపిస్తుంది.

నాట్లు వేసిన తర్వాత..

వరి నాట్లు పూర్తయి దమ్ములో జింకు సల్ఫేట్ వేయని పొలాల్లో పైరుపై జింకు సల్ఫేట్ పిచికారీ చేసి కూడా జింకు లోపాన్ని నివారించుకోవచ్చు. వరి నాట్లు వేసిన తర్వాత జింక్ లోపం కనిపిస్తే చిలేటెడ్ జింక్ రెండు గ్రాములు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే 20రోజుల వ్యవధిలో మరో దఫా ఇదే మోతాదును పిచికారీ చేసుకోవాలి. జింక్‌ను వరి పొలంలో పిచికారీ చేసేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పురుగు మందులు లేదా తెగుళ్ల మందులతో కలిపి పిచికారీ చేయకూడదు. చౌడు నేలల్లో జింకు సల్ఫేట్‌ను దమ్ములో వేయడం కంటె రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవడం లాభదాయకం.

దిగుబడులపై ప్రభావం

జింకు లోపం ఉంటే ఏ పంటలోపైనా రసాయన ఎరువులు తీసుకునే శక్తి తగ్గిపోయి వేసిన ఎరువులు వృథా అవుతాయి. వరిలో వచ్చే జింకు లోపం పంట పెరుగుదల, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. జింకు లోపం ఉన్నప్పుడు నాటిన పైరు అనారోగ్యంగా కనిపిస్తుంది. పిలకలు తక్కువగా ఆలస్యంగా వస్తాయి. అంతేగాక వచ్చిన పిలకలు సరిగా పెరగక పైరు నశించినట్లు గిడసబారి కనిపిస్తుంది. లేత ఆకులు ఈనెల మధ్య భాగం పసుపు రంగులోకి మారిపైరు కళ తప్పి కనిపిస్తుంది. జింకు లోపం తీవ్రత అధికంగా ఉన్న చోట్ల అడుగు ఆకులు ఎండిపోతాయి. ఈ విధంగా పైరు పెరుగుదలకు ఇబ్బంది కలిగి దిగుబడులు తగ్గుతాయి. జింకు ధాతు లోపం ప్రతి ఏటా పెరుగుతూ వస్తుంది. కాలక్రమేణా పోషకాల యాజమాన్యంలో వచ్చిన మార్పులు దీనికి కారణం. వరిలో దిగుబడులు తగ్గకుండా ఉండటానికి సరైన జింక్ పోషక యాజమాన్యాన్ని ఆచరించాలి.

నివారణ చర్యలు

జింకు లోప నివారణకు అన్నింటికంటే మొదట చేయాల్సింది పంటకు అవసరమైన పోషకాల్లో కనీసం 30 శాతం సేంద్రియ ఎరువుల ద్వారా అందించాలి. పశువుల ఎరువును తప్పనిసరిగా తోలించడం, ఇతర జీవన ఎరువులను వాడటం చేయాలి. సేంద్రియ ఎరువులు వినియోగించడానికి వీలు కానప్పుడు వరి నాటడానికి ముందు ఎకరాకు 20 కిలోల వంతున జింకు సల్ఫేట్ దమ్ములో వేసి పైరులో జింకు లోపం ఏర్పడకుండా నివారించుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ జింకు సల్ఫేట్ దమ్ములో వేసినప్పుడు భాస్వరపు ఎరువులలో కలిపి వేయరాదు. జింకు సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేయడానికి నాలుగు రోజుల విరామం ఉండాలి. జింకు సల్ఫేట్‌ను ఖరీఫ్, రబీ పంటలకు కలిపి ఒకసారి వేస్తే సరిపోతుంది.